క్లుప్తంగా

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



హన్వాడ: బీఆర్‌ఎస్‌ పార్టీకి సంక్షేమపథకాలే శ్రీరామరక్ష అని జెడ్పీటీసీ విజయనిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్‌ అన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్‌ మండలంలో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. బుధవారం కొనగట్టుపల్లి, బుద్దారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడ్‌ పద్ధతితో మేలు



చిన్నచింతకుంట: డ్రమ్‌సీడ్‌ పద్ధతితో వరి సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ విస్తీర్ణ అధికారి శ్రీజ రైతులకు సూచించారు. బుధవారం అప్పంపల్లి మండల రైతుబంధు కో–ఆర్డినేటర్‌ మన్నెంగౌడ్‌ పొలంలో సాగును పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు భాస్కరెడ్డిలతోపాటు పలువురు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ

మహమ్మదాబాద్‌: ఎస్‌ఐగా డీ సురేష్‌ బుధవారం మహ్మదాబాద్‌ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సైదయ్య బదిలీపై మహబూబ్‌నగర్‌ ఎస్పీ కార్యాలయానికి వెళ్లగా ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన సురేష్‌ నారాయణ్‌పేట్‌ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చారు. మండలవాసులు, నాయకులు బదిలీపై వెళ్లిన ఎస్‌ఐకి వీడ్కోలు, అదేవిధంగా ఇక్కడకు వచ్చిన ఎస్‌ఐకి స్వాగతం పలికారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడికి నిరసన



నవాబుపేట: ధన్వాడ మండలంలో పంచాయతి కార్యదర్శిపై ఎంపీఈఓ దాడి చేయటానికి వ్యతిరేకంగా మండల కేంద్రంలో పంచాయతి కార్యదర్శులు బుధవారం ఎంపీపీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎంపీడీఓ శ్రీలతకు వినతిపత్రం అందించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న కార్యదర్శులపై దాడులు భావ్యం కాదన్నారు. పునరావృతం కాకుండా చూడాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యదర్శులు కల్పన, నరేందర్‌, నరేషగౌడ్‌, క్రాంతి, అనుష, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



జడ్చర్ల: మధ్యప్రదేశ్‌లో బీజేపీకి చెందిన నేత ప్రవేశ్‌శుక్లా దివ్యాంగుడైన పాలేరావత్‌పై చేసిన దాడి, అమానవీయ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు దివ్యాంగుల హక్కుల సంఘం నాయకులు బిచ్యానాయక్‌, చెన్నకేశవులు తెలిపారు. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఎస్‌ఐ లెనిన్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. అంతకు ముందు అంబేడ్కర్‌ చౌరస్తాలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనువాసులు, పద్మ, రఫీక్‌, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

మహబూబ్‌నగర్‌ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చేసిన డ్రంకెన్‌డ్రైవ్‌ తనిఖీల్లో హౌజింగ్‌ బోర్డుకు చెందిన బాల కిష్టయ్య, రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని తనిఖీల్లో టీచర్స్‌ కాలనీకి చెందిన రాఘవేంద్ర పట్టుబడ్డారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి డి.నిర్మల ఒక్కో వాహనదారుడికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అనంతరం వాహనదారులిద్దరినీ పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

ఆదర్శంగా బీఆర్‌ఎస్‌ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్‌ లక్ష్మారెడ్డి



రాజాపూర్‌ మండల కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రాజాపూర్‌: ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత బీఆర్‌ఎస్‌ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం రాజాపూర్‌ మండల కేంద్రంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. శాలివాహన, ముదిరాజ్‌, మున్నూరుకాపు, నాయీబ్రాహ్మణ సంఘాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మటన్‌ మార్కెట్‌ భవనాన్ని, నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని, సీసీరోడ్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి రాజాపూర్‌ను అభివృద్ధి చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా సంఘాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్షాలపై ఎక్కుపెట్టారు. అభివృద్ధి చేసే నాయకుడు కావాలో, మాయమాటలు చెప్పేవారు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని అన్నారు. అవినీతి అంటేనే కాంగ్రెస్‌ అన్నారు, ఖమ్మంలో రాహుల్‌గాంధీ తాము అధికారంలోకి వస్తే రూ.4వేల పింఛన్‌ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. అదేవిధంగా మాట్లాడుతూ మండలకేంద్రంలో మహిళా సమాఖ్య భవనాన్ని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు రాజాపూర్‌ అభివృద్ధి పనులపై సర్పంచ్‌ బచ్చిరెడ్డి వివరాలు తెలియజేశారు. సమావేశంలో డీసీఎంఎస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సుశీల, వైస్‌ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్‌ రాంబాయి, ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఏఎంసీ చైర్మన్‌ రజిని, డైరెక్టర్‌లు కిష్టారంమల్లేష్‌గౌడ్‌, కృష్ణయ్యగౌడ్‌, తిరుపతయ్య, శాలివాహన సంఘం అధ్యక్షుడు వెంకటే్‌ నాయకులు శ్రీశైలంయాదవ్‌, ఆనంద్‌గౌడ్‌, నరహరి, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: కావేరమ్మపేట హనుమాన్‌ ఆలయ ప్రహరీ నిర్మాణపనులకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భూమిపూజ చేశారు. పనులను సకాలంలో నాణ్యతగా పూర్తిచేయాలని ఆదేశించారు. చైర్‌పర్సన్‌ లక్ష్మి, వైస్‌ చైర్‌పర్సన్‌ సారిక, కౌన్సిలర్‌ మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

బాలానగర్‌: మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీ నాయకుడు నారాయణ రెడ్డి, రామకృష్ణ, కొప్పెర శ్రీను, నవీన్‌ తదితరులు వారిలో ఉన్నారు. వైస్‌ ఎంపీపీ వెంకటచారి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌ రావు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం పూర్తిచేయాలి



జడ్చర్లలో సమావేశానికి హాజరైన పంచాయతి కార్యదర్శులు

జడ్చర్ల టౌన్‌: హరితహారం కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉండాలని ఏపీడీ శ్రీపాద్‌ పేర్కొన్నారు. మండల పరిషత్‌ సమావేశ మందిరంలో ఈజీఎస్‌ సిబ్బంది, పంచాయతీకార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గత నెల 19న కార్యక్రమం ప్రారంభమైనప్పటికీ వర్షాలు లేకపోవడంతో మొక్కలు నాటలేదన్నారు. మండలానికి 4.09 లక్షల మొక్కలు లక్ష్యం నిర్దేశించారని అందుక అనుగుణంగా కృషిచేయాలన్నారు. ఒక్కోపంచాయతీలో కనీసం 5వేల మొక్కలకు తగ్గకుండా నాటాలన్నారు. అయితే గ్రామాల్లో మొక్కలు నాటేందుకు స్థలాలు లేవని కార్యదర్శులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన గతంలో నాటిన ప్రాంతాల్లోనే పార్ట్‌ 2గా విభజించి మొక్కలు నాటాలన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్‌ కింద ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 5 కమ్యూనిటీ సోఫ్‌పిట్‌ (ఇంకుడుగుంతలు) నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీఓ జగదీశ్‌, ఏపీఓ విజయభాస్కర్‌లతోపాటు కార్యదర్శులు, సిబ్బందిద పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: హరితహారం లక్ష్యం పూర్తి చేయాలని డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ అనిల్‌కుమార్‌, సూపర్‌డెంట్‌ మోషిన్‌లతోపాటు పలువురున్నారు.

మహిళ అదృశ్యంపై కేసునమోదు

- భర్త వేధింపులు భరించలేక ఇంట్లోంచి వెళ్లిపోయిన వైనం

జడ్చర్ల: భర్త మానసికంగా వేధించడం భరించలేక ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటనపై కేసు నమోదైంది. ఎస్‌ఐ లెనిన్‌ కథనం మేరకు.. మల్లెబోయిన్‌పల్లికి చెందిన శ్రీలత(24)ను కొంతకాలం నుంచి ఆమె భర్త రంగయ్య మానసింగా వేధిస్తున్నాడు. అనుమానంతో పలుసార్లు గొడవ పెట్టుకున్నాడు. దీంతో భరించలేక ఆమె ఈనెల 3న ఇంటి వద్ద పిల్లలను వదలిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయింది. చుట్టు పక్కలా, బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తల్లి సుక్కమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు



కంచన్‌పల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్‌: రాష్ట్రంలో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం కంచన్‌పల్లిలో పర్యటించారు. అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన వారందరికీ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం సీఎం కేసీఆర్‌ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి సమస్యలు తీర్చారని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కంచన్‌పల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ లక్ష్మి, ఆమెభర్త రాజుతో పాటు మరో 20మంది కాంగ్రెస్‌ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌ పార్టీ ఖండువాను కప్పుకున్నారు. అభివృద్ధిని చూసే పార్టీలో చేరినట్లు వివరించారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాంలాల్‌, అశోక్‌రెడ్డి, బిక్షపతి, అశోక్‌గౌడ్‌, పెంట్యా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

గండేడ్‌: ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అంచన్‌పల్లి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. పీఏసీఎస్‌ వైస్‌చైర్మన్‌ లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్‌, సర్పంచ్‌ కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధమైన పంచాయతీ కార్మికులు



అడ్డాకులలో సమ్మెనోటీస్‌ అందజేస్తున్న కార్మికులు, నాయకులు



హన్వాడలో..

అడ్డాకుల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలో గురువారం నుంచి చేపట్టబోయే సమ్మె నోటీసును ఎంపీడీఓ మంజులకు అందజేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్‌, రవిసాగర్‌, కురమయ్య, కురుమూర్తి తదితరులు ఉన్నారు.

నవాబుపేట: పంచాయతి కార్మికులు బుధవారం ఎంపీడీఓ శ్రీలతకు సమ్మెనోటీసు అందించారు. తాము గురువారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ పంచాయతి కార్మికులకు జీఓ నంబర్‌ 60 ప్రకారం వేతనాలు అందించాలని, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ విడుదల చేశారు. సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, కుర్మయ్య, నర్సింహులు, వేణు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

హన్వాడ: మండలకేంద్రంలోని పంచాయతీ కార్మికులు తమ డిమాండ్‌ల సాధన కోసం బుధవారం సమ్మెకు దిగారు. మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గురువారం నివవధికంగా కొనసాగించనున్నామని పేర్కొన్నారు.ఎంపీడీఓ ధనుంజయగౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఆర్థికసాయం అందజేత

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని వీరన్న పేట్‌ హైస్కూల్‌లో గత విద్యాసంవత్సరం ఎస్సెస్సీ చదివిన మహేశ్వరి 9.7 మార్కులు సాధించింది. అనంతరం ఐఐఐటీ బాసరలో సీటు పొందింది. ఈమేరకు విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరంపై చదువుల నిమిత్తం రవికుమార్‌ రూ.37వేల చెక్కును ఆమెకు అందజేశారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రానికి చెందిన ప్రణీత ఉన్నత చదువుల కోసం ఆల్‌ ఇండియా కౌన్సిల్‌ ఆఫ్‌ హ్యూమన్‌ రైట్స్‌ లిబరటీస్‌ అండ్‌ సోషల్‌ జస్టిస్‌ ఆర్గనైజేషన్‌ సౌజన్యంతో రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రమకాంత్‌రెడ్డి చిన్నచింతకుంట తహసీల్దార్‌ సువర్ణరాజుతో కలిసి బుధవారం అందించారు. రమకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ ఆర్గనైజేషన్‌ పేద విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు.

అందుబాటులో ఎరువులు

హన్వాడ: మండలకేంద్రంలోని ఎఫ్‌ఏసీఎస్‌ గోదాంలో రైతులకు అవసరమైన ఎరువులు దిగుమతి అయ్యాయి. ఈ మేరకు అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌ఏసీఎస్‌ చైర్మన్‌ వెంకటయ్య బుధవారం పేర్కొన్నారు.

గ్రామాల్లో పింఛన్లు అందజేయాలి

నవాబుపేట: గ్రామాల్లో పింఛన్లు అందజేయాలని కాకర్‌జాల్‌ మాజీ సర్పంచ్‌ అలీ సూచించారు. బుధవారం మండల పరిధిలోని చౌడూర్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని కాకర్‌జాల్‌, దేపల్లి తదితర గ్రామాల లబ్ధిదారులు పింఛన్ల కోసం నడిచి రావాల్సి వస్తోందన్నారు. బీపీఎంలు ఏదో ఒక గ్రామంలో ఉంటూ చుట్టు పక్కల గ్రామాల లబ్ధిదారులను అక్కడి రావాలని చెప్పటం చాలా ఇబ్బందిగా ఉందని, గ్రామాల్లోనే అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీలతకు విజ్ఞప్తి చేశారు.

పార్టీ పుర్వవైభవానికి కృషి చేయాలి

గండేడ్‌: తెలుగుదేశం పార్టీకి పుర్వ వైభవం తీసుకు రావడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ కాసాని వీరేశ్‌ పేర్కొన్నారు. బుధవారం మన్సూర్‌పల్లిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేయాలని కోరారు. మాజీ ఎంపీపీ కొమిరె లక్ష్మయ్య, అడ్వకేటు బాలముకుందం, మాణిక్యం, శంకరయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌: తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి మళ్లీ పాతరోజులు వస్తున్నాయని పరిగి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ కాసాని వీరేశం తెలిపారు. బుధవారం నంచర్లగేట్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. గండేడ్‌ మాజీ ఎంపీపీ కొమిరె లక్ష్మయ్య, న్యాయవాది బాలముకుందం, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

స్కూల్‌ స్వీపర్ల ఆకలి గోస పట్టదా?

జెడ్పీసెంటర్‌ (మహబూబ్‌నగర్‌): ప్రభుత్వ స్కూళ్లలో దశాబ్దాల తరబడి కేవలం చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న స్వీపర్ల ఆకలి గోస ప్రభుత్వానికి పట్టడం లేదా అని ఏఐటీయూసీ అనుబంధ స్కూల్‌ స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోషే అన్నారు. తమను రెగ్యులర్‌ చేయాలనే డిమాండ్‌తో జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో స్వీపర్లు చేస్తున్న రిలే దీక్షలు బుధవారం 10వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీపర్ల సమస్యలు పరిష్కరించే పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. కొంత మందికి రూ.1,623, మరికొంత మందికి రూ.4 వేల వేతనాలు ఇస్తూ తమలోని ఐక్యతను దెబ్బ తీస్తున్నారని ఆరోపించారు. కనీస వేతనం కింద రూ.27 వేలు చెల్లించాలని, ఫుట్‌టైం వర్కర్లుగా పరిగణించాలని, చనిపోయిన వారి స్థానంలో వారసులకు ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్‌ బెనిఫిట్‌ రూ.15 లక్షలు ఇవ్వాలని, అన్ని స్కూళ్లలో స్వీపర్ల నియామకం చేపట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో స్కూల్‌ స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేష్‌, నాయకులు బాలగౌడ్‌, వెంకట్‌, జయమ్మ, బచ్చన్న, ఎల్లన్న, పుల్లమ్మ, విజయరాములు, వెంకటయ్య, శ్రీశైలం, బాలస్వామి, నారాయణ, భరత్‌, అంజమ్మ, పద్మమ్మ, వెంకటమ్మ, బాలమ్మ, శ్వేత, కవిత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని బీటీరోడ్డు

- వేసిన వారంలోపే పగుళ్లు



గుంతలు పడిన రాచాల బీటీరోడ్డు

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఇటీవల వేసిన బీటీ రెన్యూవల్‌లో నాణ్యత లోపించింది. సరైన విధంగా వేయకపోవడంతో వారంలోపే పగుళ్లు ఏర్పడ్డాయి. పొన్నకల్‌ స్టేజీ నుంచి రాచాల వరకు గతంలో ఉన్న బీటీరోడ్డు గుంతలమయంగా మారడంతో పంచాయతీరాజ్‌ శాఖ ద్వారా ఎంఆర్‌ఆర్‌ కింద 4.3కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు రెన్యూవల్‌ కోసం రూ.2.40కోట్లు మంజూరయ్యాయి. టెండర్‌లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ ఆనంద్‌రెడ్డి వాటితో గ్రామంలోని చెరువు వద్ద నుంచి ఎస్సీకాలనీ వరకు సుమారు 900 మీటర్ల దూరం సీసీరోడ్డు వేయించారు. ఇక పొన్నకల్‌ చెరువు కట్ట వద్ద నుంచి రాచాల వరకు వేసిన బీటీ రెన్యూవల్‌ పనుల్లో నాణ్యత లోపించి రోడ్డు కోతకు గురవుతోంది. చాలా చోట్ల రోడ్డుపై ఉన్న బీటీ తొలగిపోయి కింద వేసిన కంకర తేలుతోంది. వర్షాలు మొదలైతే రోడ్డు మొత్తం పాడైపోయే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత లోపించిందని విమర్శిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్‌ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా విషయాన్ని గ్రామస్తులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. రోడ్డు పనులు పూర్తయినా ఇప్పటి వరకు సీసీరోడ్డు, కల్వర్టుల పనులను మాత్రమే రికార్డు చేశామన్నారు. మెటల్‌, బీటీ పనులను రికార్డు చేయలేదన్నారు. క్వాలిటీ కంట్రోల్‌ అధికారులు వచ్చి పర్యవేక్షణ చేసిన తర్వాత కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

సైబర్‌నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ సైదులు

మహబూబ్‌నగర్‌ క్రైం: కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చేక్రమంలో కనీస జాగ్రత్తలు పాటించాలని వన్‌టౌన్‌ సీఐ సైదులు అన్నారు. వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో రామయ్యబౌళి ఏరియాలో కమ్యూనిటీ కనెక్ట్‌ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. కాలనీలో ఉన్న 150ఇళ్లలో ఉన్నవారి వివరాలు ఆరా తీయడంతో పాటు 95ద్విచక్రవాహనాలు, 20 కార్ల డాక్యుమెంట్స్‌ పరిశీలించారు. సరైన డాక్యుమెంట్స్‌ లేని 15 ద్విచక్ర వాహనాలు గుర్తించి వాటిని స్టేషన్‌కు తరలించారు. కాలనీలో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డయల్‌ 100ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌ఐ రామకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌ పుస్తకాల పంపిణీ

మహబూబ్‌నగర్‌ రూరల్‌: భారత వికాస పరిషత్‌ పాలమూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని గాజులపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సౌత్‌ ఇండియా కార్యదర్శి జి.పాండురంగం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భారతజాతి నిర్మాణంలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో పరిషత్‌ జిల్లా అధ్యక్షుడు రమేష్‌ చందర్‌, ప్రధాన కార్యదర్శి భూషణ్‌ పాండే, ప్రసాద్‌, రామచందర్‌, చంద్రుడు, రాజాచారి, వెంకటేశ్వర గుప్తా, హెచ్‌ఎం ఖాజా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌: స్నేహ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పెద్దాయపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్‌ ఇతర సామగ్రి బుధవారం పంపిణీ చేశారు. సర్పంచ్‌ శంకరప్ప, ఫౌండేషన్‌ ఇన్‌చార్జ్‌ రాజామోహన్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు..

మిడ్జిల్‌: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్‌ వెంకటయ్య పంపిణీ చేశారు. విద్యార్థులు మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మండలం కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలం చేయాలని మండలసాధన సమితి ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున విధుల గుండా ర్యాలీ తీస్తూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్‌ రామునాయక్‌, వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గార్లపహాడ్‌ మండలం కోసం 165రోజులుగా నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారమే కనిపిస్తుందని ప్రజల సమస్యలు తెలియడంలేదన్నారు. గార్లపహాడ్‌పై ఎమ్మెల్యే కక్షపూరిత వైఖరిని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌, రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌ రెడ్డి

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్‌.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో వీరాంజనేయ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. అదేవిధంగా శ్రీరామకొండ అభివృద్ధికి ఇప్పటికే రూ.10కోట్లు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులను పూర్తి అవుతాయన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఆదిఆంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వాలు ఆలయాలను పట్టించుకోలేదని, కానీ సీఎం కేసీఆర్‌ రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.5,300 జరిమానా



మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: పట్టణంలో రెండోరోజు బుధవారం వివిధ షాపులను తనిఖీ చేసి రూ.5,300 జరిమానా విధించారు. స్థానిక న్యూటౌన్‌ నుంచి కొత్త బస్టాండు వరకు సుమారు 25 దుకాణాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ గురులింగం ఆధ్వర్యంలో పరిశీలించారు. 120 మైక్రాన్ల లోపు మోతాదు కలిగిన 37 కిలోల పాలథీన్‌, ప్లాస్టిక్‌ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. మొదటిరోజు వంద కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని రూ.15 వేలు జరిమానా విధించిన విషయం విదితమే.

ఘనంగా బోనాల వేడుక

నవాబుపేట: పోమాల్‌, గడ్డతండా, పుట్టోనిపల్లి గ్రామాల్లో బంగారు మైసమ్మ గ్రామదేవతల బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించారు. సర్పంచ్‌ కృష్ణ, జగన్‌, రమేష్‌, శ్రీహరి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.